కథ

# నిలయం

**గొల్లపూడి రాజ్యలక్ష్మి**

**"ఇరవై నాలుగ్గంటలూ పేపరూ-వార్తలూ తప్ప ఏ విషయమూ పట్టించుకోరు. అసలీ కొంపలో ఏం జరుగుతోందో తెలుసా?" అంటూ రుసరుసలాడుతూ వచ్చింది వర్ధనమ్మ.**

**పేపర్లోంచి తలెత్తి భార్య వంక చూసి "పొద్దున్నే మొదలైంది!" అనుకున్నాడు పరాంకుశం.**

"ఏవిటీ ఉలుకూ-పలుకూ లేదు? మాట విన్పించిందా లేదా?" అంది గద్దిస్తూ.

"విన్పించకపోవటానికి తమరిదేం సామాన్యమైన గొంతా? అతి కోమలం!" అన్నాడు వ్యంగ్యంగా.

"అందుకేనా బెల్లంకొట్టిన రాయల్లే కూర్చున్నారు. ఈ విసుర్లకేంగానీ మీ అక్కయ్య ఏం చేసిందో చూశారా?" అంది కాస్త గొంతు తగ్గించి.

'ఏం చేసిందన్నట్లు' ప్రశ్నార్థకంగా చూశాడు.

"వంట, ఇంటి పెత్తనమంతా తనే తీసుకుందిగా? తను చిక్కటి పాలతో స్ట్రాంగ్‌గా కాఫీ కలుపుకుని తాగుతూ, మన మొహాన నీళ్లకాఫీ పోస్తోందండీ!" అన్నది ఏదో పెద్ద రహస్యం కనిపెట్టినట్లు.

పరాంకుశం నిటారుగా అయ్యాడు. "ఛ..వూరుకో.. నోటికేదొస్తే అది అనేయటమేనా? అంత ఛండాలప్పని అదెందుకు చేస్తుంది?" అన్నాడు మందలింపుగా.

"తెలీకపోతే నోరుమూసుకోండి. ఇందాక తనకోసం కలుపుకున్న కాఫీ కాస్త నోట్లో పోసుకుని చూశాను. బండారం బైటపడింది" అన్నది.

"నీ అనుమానం పాడుగానూ, తన ఎంగిలి కాఫీ తాగేదాకా నీ ఆరాటం తీరలేదన్నమాట?"

"అంత దిక్కుమాలిన పని నేనెందుకు చేస్తాను? ఎప్పుడూ పేపర్ ధ్యాస తప్ప నామాట సరిగ్గా చెవిన వేసుకోరు. మీకీ జబ్బు వదలదు!" అంది విసురుగా.

"సర్లె..సోది ఆపు.. ఇంత గొప్ప విషయం చెప్పటానికేనా పని కట్టుకుని వచ్చావు?" అన్నాడు విసుగ్గా.

"అంతేకాదు..నిన్నటికి నిన్న బట్టలన్నిటికీ సబ్బు పెడతానంటూ వచ్చిందా? ఇంత సబ్బుపొడి పోసి తనవన్నీ సుబ్బరంగా వుతుక్కుంది. మన బట్టలన్నీ వట్టి నీళ్లుపోసి ఉప్పళించి పడేసింది. సొమ్మొకడిది సోకొకడిదని వూరికే అన్నారా?" అంది మొహం గంటుపెట్టుకుని.

పరాంకుశం ఒక్కక్షణం ఆగి నిట్టూర్చి గొంతులో సౌమ్యత తెచ్చుకుని నచ్చచెప్పుతున్నట్లుగా అన్నాడు. "చూడు వర్ధనం. మా అక్కయ్యకి జరుగుబాటేం లేక మనింటికి రాలేదు. బావ పోయాక పుట్టెడు దుఃఖంతో-ఇల్లు కదలక దిగులుతో వుందని కాస్త మార్పుగా కొన్నాళ్లు మనింట్లో వుండమంటే వచ్చింది. తను వున్నన్నాళ్లూ మర్యాద ఇచ్చిపుచ్చుకుంటే మంచిది.

ఇట్లాంటి లేకి బుద్ధులన్నీ అంటగట్టి దాన్ని బాధ పెట్టి-నువ్వు వెలితిపడొద్దు. అర్థమైందనుకుంటాను. ఇంక నా మానాన నన్నొదిలేయ్!" మళ్లీ పేపర్లో తల దూర్చాడు.

"మీరేం మొగుడండీ? మొద్దులు నయం. కట్టుకున్న దాని కష్టం-సుఖం పట్టించుకోకపోగా నీతులొకటి. అంతా నా ఖర్మ!" అంది నెత్తిమీద కొట్టుకుని.

"ముప్ఫయ్ ఏళ్లనుంచీ ఇదేమాట వినీ వినీ నా చెవులు కాయలు కాసినయ్. చెప్పటం అయిందిగా. ఇంక నా ఖర్మకు నన్నొదిలేస్తావా..లేదా?" అన్నాడు విసుగ్గా.

"అమ్మ నన్నూ పిల్లల్నీ చూడాలని గొడవ పెడ్తోందిట. పాపం..వాడు మాత్రం ఎంతకాలమని చూస్తాడు?" అన్నాడు నచ్చజెప్పాలని.

"అంత కలవరించిపోతుంటే మీరే వెళ్లి చూసిరండి. అంతేగానీ ఆవిడిక్కడికి రావటానికి నేనొప్పుకోను"

"నువ్వొప్పుకోవనే నాలుగేళ్లనించీ వాడిదగ్గరే వుంది. ఇంకా అక్కడే వుండమనటం అన్యాయం వర్ధనీ!" అన్నాడు కాస్త బాధగా.

"ఆవిడ చేసిందంతా న్యాయంగా వుందా? ఓపిక వున్నన్నాళ్లూ చిన్నకొడుకు ఇల్లు వదలకుండా వాళ్లకు చాకిరీ చేసింది. ఇప్పుడు లేవలేని స్థితికి వచ్చాక మనం కావాల్సి వచ్చామా?" అంది కోపంగా.

"ఎప్పుడొచ్చినా నువ్వేగా ఏదో ఒక తగువు పెట్టుకుని పంపిస్తావు? ఆవిడ మాత్రం ఏం చేస్తుంది?"

చటుక్కున ఏదో గుర్తొచ్చి "ఆ..అన్నట్టు అడగటం మరిచాను. ఆ ఉత్తరం సంగతి ఏం చేశారు?" అనడిగింది వర్ధనమ్మ.

"ఏం ఉత్తరం?" అనడిగాడు కాస్త ఆశ్చర్యంగా.

"ఏ ఉత్తరమా? నిన్న మీ తమ్ముడు రాశాడే..ఆ ఉత్తరం" అన్నది వొత్తిపలుకుతూ.

"నువ్వెప్పుడు చూశావు?"

"ఏం? నేను చూడకూడదనుకున్నారా?"

"అబ్బే..అదేం లేదు...అంత ధైర్యం కూడానా?"

"అందుకేనా? మాట వరసకైనా చెప్పకుండా డైరీలో దాచుకున్నారు?" అన్నది పెద్దగొంతుతో.

"అట్లా అరుస్తావెందుకు? కాస్త నెమ్మదిగా మాట్లాడవచ్చు కదా?" అన్నాడు.

"నా గొంతే అంత. అయినా అది రహస్యంగా మాట్లాడుకునే విషయమా?"

"ఏది?"

"ఆహా..ఏం అమాయకత్వం! నాచేత వాగించాలనేగానీ మీరు బయటపడరన్నమాట? గుండెలు తీసిన బంటు అంటే ఇదే.."

"వ్యంగ్యం చాలించి విషయం చెప్పు!"

"చెప్తాను. నాకేం భయమా? మీ అమ్మను తీసుకొచ్చి, నా నెత్తిన పెట్టాలని చూస్తున్నాడుగా మీ తమ్ముడు! అదేం కుదరదని చెప్పండి!" అంది ఖచ్చితంగా.

"ఎందుకు కుదరదు?" అన్నాడు సూటిగా చూస్తూ.

"ఎందుకా? ఆవిడ్ని కూచోబెట్టి అడ్డమైన చాకిరీ చెయ్యటానికి నాకంత ఓపిక లేదు" అంది కట్టె విరిచినట్టు.

"అదంతా నాకనవసరం. మీరు మెత్తబడి ఆవిడ్ని తీసుకొచ్చారంటే ఆ తర్వాత నన్ని ప్రయోజనం వుండదు!"

పరాంకుశం ఏదో అనబోయి పార్వతి అటువైపే రావటం చూసి ఆగిపోయి-

"సరేలే! అదిగో..అక్కయ్య ఇటే వస్తోంది. ఆవిడ ముందు అతి తెలివి చూపించక నోరుమూసుక్కూచో కాస్సేపు!" అన్నాడు విసుగ్గా.

మొగుడి వంక తీక్షణంగా ఓ చూపు విసిరి అంతలోనే నవ్వు తెచ్చుకుని-

"రావమ్మా వదినా! అప్పుడే స్నానం చేసి దేవుడి ముందు దీపం వెలిగించినట్లున్నావ్? ఇంత వయసొచ్చినా నీలో చురుకుతనం తగ్గలేదు సుమా! అదృష్టవంతురాలివి!" అంది వర్ధనమ్మ.

"యాభై ఏళ్ల పైనుంచి వున్న అలవాటు. ఎట్లాపోతుంది వర్ధనీ? ఈ ఘటం వున్నన్నాళ్లూ ఇలా జరిగిపోనీ. అది సరే..ఈ పూట వంట ఏం చేయమంటావ్ తమ్ముడూ?" అంటూ పరాంకుశంని ప్రశ్నించింది.

"ఏదో ఒకటి. అయినా నువ్వు చేయటం దేనికి అక్కయ్యా? మీ మరదలు వుందిగా. అది చూసుకుంటుందిలే. నువ్వు హాయిగా కూర్చో" అన్నాడు పరాంకుశం.

"ఊరికే కూర్చుంటే నాకు మాత్రం ఏం తోస్తుందిరా? పాపం వర్ధని! తనకి మాత్రం చేసి పెట్టేవాళ్లు ఎవరున్నారు?"

"పోనీలే వదినా! నీకన్నా నామీద ఆమాత్రం అభిమానం వుంది. ఈ కొంపలో ఏనాడైనా సుఖపడి చచ్చానా? ఎప్పుడూ చాకిరీ..చాకిరీ.. కొందరి జన్మలు అంతే వదినా! అయినా నీకెందుకులేమ్మా! నాకు తప్పదుగా. నేను

చూసుకుంటాలే!" అంది మొహం ముడుచుకుని.

"అదేంమాట వర్ధనీ? నేనేం పరాయిదాన్నా? వాడి మాటలకేంగానీ ఏం చేయమంటావు చెప్పు. కాకర కాయ పులుసుపెట్టి వండనా? క్యాబేజీ కొబ్బరి తేనా?" అనడిగింది పార్వతమ్మ.

పరాంకుశం కల్పించుకుంటూ "అక్కయ్యా! ఇప్పుడు వంటకేం తొందర వచ్చింది. కాస్సేపు కూర్చో ప్రశాంతంగా. నీ ఇంట్లో ఎట్లాగూ తప్పదు. ఇక్కడ కూడా ఎందుకు? మీ మరదలు పైకి అట్లా అంటుందిగానీ నువ్వంటే దానికి ఎంత ఆప్యాయతో! రాక రాక వచ్చావు. నీతో వంట చేయి స్తున్నందుకు ఎంత బాధపడుతోందో పాపం!" అన్నాడు వ్యంగ్యంగా.

"అవునమ్మా వదినా! నువ్వీ ఇంటి ఆడపడుచువి. మహారాణిలా కూర్చుని కావాల్సినవి అడిగి చేయించుకో వాలి గానీ-నువ్వెందుకు కష్టపడటం?" అంది బలవంతాన నవ్వు తెచ్చుకుని.

"చూశావా అక్కయ్యా? నేను చెప్ప లేదూ? నువ్వంటే ఎంత గౌరవం. ఎంత ప్రేమా..ఎంత అదీ ఎంత ఇదీ.."

"నాకు తెలీదా తమ్ముడూ? వర్ధని నాకు కొత్తా? నేనన్నా- అమ్మన్నా ఎంత గౌరవం..ఎంత మర్యాదా! ఎల్లాగైనా వర్ధని తీరేవేరు!" అంది మెచ్చుకుంటూ.


"పోనీలే వదినా...ఇన్నేళ్ల కాపురంలో మీ తమ్ముడు నన్నర్థం చేసుకోలేదుగానీ నువ్వు తెల్సు కున్నావ్. అదే నాకు సంతోషం" అని నిట్టూర్చి "సరే..వస్తా..వంటింట్లో బోలెడు పని చచ్చిందిగా!" అంటూ లేచి లోపలికెళ్లింది.

పరాంకుశం రిలీఫ్‌గా ఊపిరి పీల్చుకుని "కూర్చో అక్కయ్యా. నువ్వొచ్చినప్పట్నించి తీరిగ్గా మనం మాట్లాడుకుంది లేదు. నీ మనవడి కబుర్లు చెప్పు. బళ్లో వేశారా? అన్నట్టు నీ కోడలు కూడా ఉద్యోగం చేస్తోందిగా? మరి నీ మనవడ్ని ఎవరు చూసుకుంటారు?" అనడి గాడు.

"ఎవరేమిట్రా? నేను లేనూ? వాడికి ఈ బామ్మంటే ప్రాణం. బామ్మా బామ్మా అంటూ నన్ను వదలడు. పిచ్చి సన్నాసి!"

"అవున్లే. నీకూ వాడితో కాస్త కాలక్షేపం" అంటూ ఏదో గుర్తొచ్చి నిట్టూర్చి "వాళ్ల అచ్చటా..ముచ్చటా చూసుకోవ టానిక్కూడా అదృష్టం వుండాలిగా! నాకూ వున్నాడు మన వడు. ఏం లాభం? ఉన్నాడని చెప్పుకోవటానికి తప్ప ఇంతవరకు వాడి ముఖం చూసి ఎరగను. ఇక ముందు చూస్తానని నమ్మకమూ లేదు" అన్నాడు.

"రవి కొడుకు సంగతేనా? ఏమిటో..ఈ అమెరికా ఉద్యో



గాలు వచ్చాక కన్నబిడ్డల ముఖాలు చూసుకోవటం కూడా కరువైపోయింది. ఫొటోల్లోనూ-వీడియోల్లోనూ చూసి తృప్తిపడాల్సిందే!" అంది ఆలోచిస్తూ.

"పరాయి దేశం పంపే ముందు ఎంతో గర్వపడ్డాను. నా కొడుకు కూడా విదేశాల్లో పెద్ద ఉద్యోగస్తుడని నలుగురికీ చెప్పుకుని మురిసిపోయాను. ఆ మురిపెం మూన్నాళ్ల ముచ్చటయింది. అక్కడి పిల్లనే పెళ్లాడి పూర్తిగా వీడు కూడా పరాయి దేశీయుడయ్యాడు. నెలకో-రెండు నెల లకో ఓ ఫోన్ చేసేవాడు. ఇప్పుడా ముచ్చటా లేదు!" అన్నాడు బాధగా.

"అయిందేదో అయింది. వాడికి ఇష్టమైన అమ్మాయినే కట్టుకున్నాడు కదా? ఒకసారి ఆ పిల్లతో ఇక్కడికొచ్చి-తన దేశాన్ని, తనవాళ్లను, తన పుట్టిన వూరినీ ఇల్లూ-వాకిళ్లూ అన్నీ చూపించవచ్చు కదా? అంత తీరిక లేని ఉద్యో గమా?" అన్నది పార్వతమ్మ.

"తీరిక లేక కాదు. మనసు లేక. మొదట్లో ఆ పెళ్లిని వ్యతిరేకించాం కదా? మనదేశం కాదు, భాష కాదు, సంప్ర దాయం కాదు. ఎందుకు తొందరపడ్డావని కాస్త కోపగిం చిన మాట నిజమే. ఆమాత్రం బాధ కన్నవాళ్లకుండదా? అది అర్థం చేసుకోక, సంస్కారం లేనివాళ్లమన్నాడు. కూప స్థమండూకాలమన్నాడు. పెళ్లి విషయంలో తను సర్వ స్వతంత్రుడట! ఎవరికోసమో తన ఇష్టాన్ని చంపుకోలే డట! ఇంకా ఏవేవో అన్నాడు. ఆనాటినుంచీ నాకో పెద్దకొ డుకు వున్నాడన్న సంగతే మర్చిపోయాను. పోనీయ్...ఇప్పుడు మళ్లీ అవన్నీ గుర్తుచేసుకోవటం వల్ల బాధ తప్ప ఏముంది?" అన్నాడు సర్దుకుంటూ.

"అదీ నిజమే...అయినా ఇవన్నీ తాత్కాలికంరా. కొంతకాలం గడిస్తే అన్నీ సర్దుకుంటాయ్. బాధప డకు!" అంది ఓదార్పుగా.

"అది సరేగాని అక్కయ్యా! గోపాలం ఉత్తరం రాశాడు!"

"ఏం రాశాడు? అంతా బావున్నారా? అమ్మ ఎలా వుందిట?"

"ఎలా వుంటుంది? బాగానే వుందిట. ఆవిడకీ బాగా ఓపిక తగ్గిపోయిందిట. ఈమధ్య మాట కూడా సరిగ్గా విన్పించటం లేదుట. వృద్ధాప్యంలో వచ్చే సమస్యలేగా ఇవి. నిజానికి గోపాలం నాకంటే వయసులో చిన్నవాడైనా పెద్దమనసు. అమ్మని ఎంతో ప్రేమగా చూసుకుంటూ తల్లిరుణం తీర్చుకుంటున్నాడు. పాపం వాడికి ఇప్పుడు ఇబ్బంది వచ్చిపడింది. గోపాలం కూతురు సుమతికిప్పుడు డెలివరీ టైమట. కాన్పుకోసం వాడి భార్య శాంత అమెరికా ప్రయాణం పెట్టుకుంది. అమ్మని తనొక్కడే చూసుకోవటం కష్టమని, నాదగ్గర వదిలి వెళ్దామనుకుంటున్నాడు" అన్నాడు పరాంకుశం.

"బావుంది. అయితే అమ్మ వస్తుందన్నమాట! ఎప్పుడు తీసుకొస్తున్నాడు?" అన్నది పార్వతమ్మ సంతోషించి.

ఏదో అనబోయిన పరాంకుశం వర్ధని అటు రావటం చూసి ఆగిపోయాడు.

"ఏవిటి నన్ను చూసి మాటలు ఆపేశారు? అంత వినకూడని రహస్యాలు ఏవిటమ్మా వదినా?" అనడిగింది వర్ధని నవ్వుతూ అన్నట్టుగానే అంటూ చురక వేస్తూ.

"నీకు తెలీని రహస్యాలు మాకేముంటాయి వర్ధనీ" అంది పార్వతమ్మ.

"ఏమోనమ్మా? ఎంతయినా మీరిద్దరూ అక్కాతమ్ముళ్లు. కష్టసుఖాలు చెప్పుకుంటున్నారేమో.. పానకంలో పుడకలా వచ్చాను?"

"ఏవిటా వంకర మాటలు? తిన్నగా మాట్లాడటం రాదా?" అన్నాడు చిరాగ్గా పరాంకుశం.

"వంకర మాటలు-నంగి చూపులు మీకలవాటు. నాకవన్నీ తెలీదు. ఉన్నదున్నట్టు మొహం మీద అనేస్తాను. అందుకేగా అందరికీ కానిదాన్ని అయిపోయాను" అన్నది ముఖం చించుకుని.

"ఎందుకురా విసుక్కుంటావు? ఇప్పుడు వర్ధని ఏమన్నదని?" అన్నది పార్వతి.

"ఆ విసుగెందుకో నన్నడుగు చెప్తాను. మీ గోపాలం ఆ ముసలావిడ్ని తెచ్చి నీ నెత్తిన పెడ్తానని రాశాడు. నావల్ల కాదన్నాను. అదీ ఆ విసుగు!" అన్నది వర్ధని.

ఏం మాట్లాడాలో తెలీనట్టు వర్ధని ముఖంలోకి చూసి వూరుకుంది పార్వతమ్మ.

"నువ్వు చూస్తూనే వున్నావుగా వదినా? నాకేమో మోకాళ్ల నెప్పులు. బుర్ర తిరుగుతూ వుంటుంది. చూపించుకోలేదుగానీ బి.పి. వుండే వుంటుంది. ఈ పరిస్థితిలో ఆవిడ్ని కూచోపెట్టి చేయాలంటే మాటలా చెప్పు?" అన్నది మళ్లీ వర్ధని.

"వాడెంతో తప్పని పరిస్థితిలో రాశాడు ఉత్తరం. ఛ..ఎందుకూ పనికిరాని అసమర్థుడినైపోయాను. అమ్మని తల్చుకుంటే దిగులేస్తుంది" అన్నాడు పరాంకుశం.

"అంత దిగులు పడటానికి ఇప్పుడేం కష్టం వచ్చిందిట?" అంది ముఖాన్ని గంటు పెట్టుకుని-వర్ధని.

"తెలిసీ తెలియనట్లు నటించేవాళ్లంటే నాకొళ్లు మంట" అన్నాడు.

"మండుతుంది...ఎందుకు మండదూ? ఆవిడ గార్ని తెచ్చి నా నెత్తిన కూర్చోపెడితేగానీ మీ ఒళ్ళు మంట చల్లారదు. నేనిక్కడ సుఖపడిపోతున్నాననేగా మీదుగ్ధ. అయినా అనకూడదుగానీ వదినా, మరీ అంతకాలం ఎవరూ బతక్కూడదు సుమా! పళ్లూడిపోయి, కళ్లూ-చెవులూ పనిచేయక, కాళ్లు చచ్చుపడి ఎందుకొచ్చిన బతుకమ్మా? మీ అమ్మలాగా ఇట్లా కాళ్లకు చుట్టుకుని పీడించటానికి తప్పు!" అంది ఈసడింపుగా.

పార్వతమ్మ చేష్టలుడిగినదానిలా చూసింది.

పరాంకుశం ఆగ్రహం పట్టలేకపోయాడు. "నోర్మూసుకో. మోకాళ్ల నొప్పులని మూలిగావుగా? రేపు నీ గతి ఏమిటో ఆలోచించు" అన్నాడు.

"నాకంత ఖర్మేం కాలింది? నా పిల్లలకి నేనంటే వల్లమాలిన ప్రేమ. రవి దూరాన వున్నా-నేనంటే ప్రేమే! ఇంక సుందరం నా కాల్లో ముల్లుగుచ్చుకున్నా విలవిల లాడతాడు. నాగురించి నాకేం దిగుల్లేదు. ఇదిగో ఇలాంటి వంకర మాటలతో-ముందు మీ జీవితం ఏమైపోతుందో చూసుకోండి" అంది వర్ధని బెదిరింపుగా.

"ఎంత నమ్మకం! ఒకప్పుడు మా అమ్మ కూడా నన్ను చూసి అలాగే అనుకుంది. ఇప్పుడేం జరుగుతోంది? నీకూ వస్తుంది ఆ సమయం. అప్పుడు అనుభవిస్తావు" అన్నాడు కటువుగా.

"ఏమిటి? శపిస్తున్నారా? చూశావమ్మా వదినా? ఇదీ వరుస. అస్తమానం మీ అమ్మను అడ్డంపెట్టుకుని నన్ను ఆడిపోసుకోందే రోజు గడవదు. పెళ్లాం కష్టం-సుఖం ఆలోచించని ఈ మనిషితో ఎట్లా కాపురం చేయాలో నువ్వే చెప్పు" అంటూ దుఃఖపడి చీదటం మొదలుపెట్టింది వర్ధని.

"ఇది మాకు మామూలే అక్కయ్యా! నువ్వేం పట్టించుకోకు" అన్నాడు పరాంకుశం.

"చూడు వర్ధనీ! ఒకమాట చెబుతాను కోపగించుకోకు. అన్నిరోజులూ అందరికీ ఒకేలా వుండవు. ఎవరి మొహాన ఏం రాసిపెట్టివుందో ఆ భగవంతుడికే తెలియాలి. తొందరపడి ఒకమాట అనేముందు-వెనుకా ముందూ ఆలోచించాలి. వృద్ధాప్యం గడప ముందు మనం వున్నామని మరచిపోకు. పాపం గోపాలం! ఎంత కాలమని చూస్తాడు? ఇప్పుడు వాడు ఎటూ తోచని పరిస్థితిలో మీ సహాయం కోరాడు. కాదనటం న్యాయమేనా? బొత్తిగా 'నాకేం సంబంధం లేదు!' అనటం అమానుషం" అన్నది పార్వతమ్మ నెమ్మదిగానే అయినా స్పష్టంగా.

"బావుందమ్మా వరస! తమ్ముడికి వంత పలుకుతూ నువ్వూ నన్నే తప్పు పడుతున్నావా? అవున్లే..నువ్వూ ఆ తాన్లో గుడ్డేగా? ఎక్కడికి పోతాయ్ బుద్ధులు? అంతా నా ఖర్మ. అంతా నన్ను ఆడిపోసుకునే వాళ్లే!" వర్ధని గయ్యిమంది.

లోపలి గదిలో ఏదో రాసుకుంటూ కూర్చున్న సుందరం గబగబా వచ్చాడు. "ఏమిటి వాకిట్లో ఈ గొడవంతా? ఎవరైనా విని నవ్వుతారనే ఇంగితం కూడా లేదా మీకు? ఈ కొంపలో ప్రశాంతత అన్నదే వుండి చావదు. ఎప్పుడూ ఏదో ఒక విషయంలో కీచులాటలే..ఛ" అన్నాడు కోపంగా.

"మీ నాన్నకా జ్ఞానం వుంటే..నా బతుకిలా ఎందుకుంటుంది? అంతా నా ఖర్మ" అంది దుఃఖాన్ని తెచ్చిపెట్టుకుంటూ వర్ధని.

"నువ్వు మాత్రం తక్కువా? ప్రతిదానికీ

## ముగ్గురు పిల్లలు

**మాధురీ దీక్షిత్ ఇప్పుడు ఇద్దరు పిల్లల్ని కనేసి ఎంచక్కా వాళ్ల ఆలనా పాలనా చూసుకుంటోంది. అందువల్ల కాబోలు సినిమాలకి స్వస్తి చెప్పేసినట్టే కనిపిస్తోంది అంటున్నారు బాలీవుడ్ జనాలు. ఆ మాటే ఆమెతో అంటే 'ఇద్దరు పిల్లలు కాదండోయ్... ముగ్గురు. మరి మా వారు శ్రీరామ్ కూడా ఓ పిల్లాడి లాంటి వారే. అన్నిటికీ నేను పక్కన లేనిదే ఆయనకి కుదరదు' అంటూ ముసిముసిగా నవ్వింది. వెండి తెరకి గుడ్‌బై చెప్తున్నట్టా లేదా అనేది మాత్రం కచ్చితంగా చెప్పడం లేదు.**



రాద్ధాంతం చేస్తూ గోటితో పోయేదాన్ని గొడ్డలిదాకా తెస్తావు" అన్నాడు తల్లిపై రుసరుసలాడుతూ.

"మధ్యలో నన్నంటావేరా? అన్నింటికీ మూలం మీ నాన్నే. ఏదో ఒక సమస్యని తెచ్చి నా నెత్తిన రుద్దాలని చూస్తుంటారు" అంది మొగుడ్ని నేరస్తుడిలా చూస్తూ.

"అబ్బ ఇంక ఆపమ్మా! దయచేసి లోపలికెళ్లు" అని కసిరాడు.

"బావుంది నాయనా వరుస. ఉరుమురుమి మంగలం మీద పడ్డట్లు నామీద విస్కుంటావేం?" అని సణుగుతూ లోపలికెళ్లింది.

"అమ్మకిష్టంలేదని తెలిసీ ఎందుకు వాదం పెట్టుకుంటావు నాన్నా? ఒకవేళ బామ్మ వచ్చినా ఇక్కడ మనశ్శాంతిగా వుండగలుగుతుందా? ఈ గొడవంతా ఎందుకు? హాయిగా అత్తయ్య దగ్గర వుండొచ్చుకదా? ఏం? ఆవిడ కూతురేగా? ఉంటే తప్పేం వుంది?" అన్నాడు తండ్రితో.

"మతి వుండే మాట్లాడుతున్నావా? అత్తయ్యే ఇప్పుడు కొడుకూ-కోడలి మీద ఆధారపడి వుంది. తనేం చేయగలుగుతుంది? బామ్మ కూడా ఇందుకు ఒప్పుకోదు" అన్నాడు పరాంకుశం.

"అలాంటప్పుడు శుభ్రంగా ఏ ఓల్డేజ్ హోంలోనో వుంచితే సరిపోతుంది కదా? ఇంత చిన్న విషయం మీకెందుకు తట్టదో, నాకర్థం కాదు" అంటూ లోపలికెళ్లిపోయాడు.

పరాంకుశం, పార్వతమ్మ నిర్ఘాంతపోయారు.

* * *

ఆ రాత్రంతా పరాంకుశానికి నిద్ర పట్టలేదు. భార్య ధోరణి, కొడుకు మాటలు కలవరపెట్టి కంటిమీద కునుకు లేకుండా చేసినయ్.

'ఓల్డేజ్ హోం' అంటూ ఎంత తేలిగ్గా అనేశాడు! అది చిన్న విషయమా? రేపు తన విషయంలోనూ అదే పరిష్కారం అనుకుంటాడేమో! ఔను.. మానవ సంబంధాల్ని వెనక్కినెట్టి, డబ్బు-సంపాదనే ప్రధాన మనుకునే ఈ తరం పిల్లల్నించి ఇంతకంటే ఎక్కువ ఆశించటం ఎంత అవివేకం. ఒకవిధంగా వాడు తనకు కనువిప్పు కల్గించాడు. ఆవైపు కూడా ఆలోచించటానికి మార్గం చూపించాడు అనుకున్నాడు.

పార్వతమ్మకీ నిద్ర పట్టలేదు. సుందరం మాటలు పదే పదే గుర్తొచ్చి ఆలోచిస్తూనే వుంది.

తెల్లవారింది.

మంచంలో బద్ధకంగా పడుకుని వున్న పరాంశకుశాన్ని చూసి "వంట్లో బావుందా?" అనడిగింది పార్వతమ్మ.

"బావుండకేం?" అంటూ లేచి కూర్చున్నాడు.

"రాత్రంతా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చానురా" అన్నది.

ఏమిటన్నట్లుగా చూశాడు.

"సుందరం కటువుగా చెప్పినా నిజమే చెప్పాడు. అమ్మ నాకూ అమ్మేగా! నాదగ్గరకు తెచ్చుకుంటాను!" అన్నది స్థిరంగా.

"నా అసమర్ధతను ఎత్తి చూపిస్తున్నావా అక్కయ్యా?" అన్నాడు తల వంచుకుని ఆవేదనగా.

"అదేం మాటరా? నేనలా అంటానా?" అన్నది నొచ్చుకుంటూ.

"మరిదేమిటి? నువ్వన్నట్టు అమ్మ నాకూ అమ్మేగా? నీ బిడ్డల మీద ఆధారపడ్డ నువ్వే ఈ నిర్ణయం తీసుకున్నప్పుడు-కొడుకుగా అమ్మకు నేనేం చేయలేననుకున్నావా?"

"నీ స్వభావం నాకు తెలీదా? నీకు మనసుంది. కానీ ఇంట్లో పరిస్థితి అనుకూలించాలిగా!"

"మనసున్నప్పుడు మార్గం కూడా వుంటుంది. ఇంత కాలం నేను ఎంత అజ్ఞానంలో వున్నానో, మూర్ఖంగా, సంకుచితంగా ఆలోచిస్తున్నానో నాకిప్పుడే అర్ధమైంది. అమ్మ బాధ్యత పూర్తిగా వర్ధనిదే అన్న భావంతో తను సహకరించటం లేదని సమాధానపడి నెపం తనమీద వేసి, నా బాధ్యతను విస్మరించాను. నా తప్పు నాకిప్పుడే తెలిసింది. నిజానికి అమ్మ బాధ్యత పూర్తిగా నాదే. వర్ధని చూడటం, చూడకపోవటం అన్నది తన స్వభావాన్ని బట్టి, సంస్కారాన్ని బట్టి వుంటుంది. తనే చూడాలని శాసించటం నా పురుషాహంకారం. అమ్మ నాకు ఎంత చేస్తే ఇంతవాడ్ని అయ్యాను! అందుకు ప్రతిగా- ఆమె రక్తం పంచుకు పుట్టినవాడిగా ఇట్లాగే ఆలోచించాలి. భార్య సహకారం వుంటే మంచిదే. లేకపోతే పోనీ.. తనకు జవసత్వాలుంటే చాలు!"

"అంటే? ఏం చేద్దామనుకుంటున్నావు? అమ్మకు నువ్వే సేవ చేద్దామనా?"

"అవును...అమ్మ ఇంక నాదగ్గరే వుంటుంది. ఆవిడ శేష జీవితాన్ని నిశ్చింతగా గడిపే ఏర్పాటు చేస్తాను. ఈ నిర్ణయంలో ఏ మార్పూ వుండదు" అన్నాడు దృఢంగా.

పార్వతమ్మ ఇంకేం మాట్లాడలేకపోయింది. ఆ మర్నాడే తన వూరు వెళ్లిపోయింది.

మరో వారం రోజులు పరాంకుశం ఎక్కడెక్కడో తిరిగాడు. ఎవరెవర్నో కలిశాడు. ఆ తర్వాత ఎంతో ప్రశాంతత కన్పించిందతనిలో.

ఆరోజు తన సూట్‌కేస్ సర్దుకుంటూ కూర్చున్న పరాంకుశంతో "ఎక్కడికి? ఏదైనా ఊరెళ్తున్నారా?" అనడిగింది వర్ధని.

"అలాంటిదే..వానప్రస్థం" అన్నాడు గంభీరంగా.

"అంటే?" అన్నది అర్థం కాక.

"అంటే తెలీదా?"

"తెలియకేగా అడుగుతున్నాను?" అని ఒక్కక్షణం ఆగి "ఓహో..మీ తమ్ముడి దగ్గరికేగా?" అన్నది ముఖం చిట్లించి.

"అవును!"

"ఆవిడ్ని తీసుకురావటానికేగా?" అంది ఉక్రోషం పట్టలేక.

"దిగులుపడకు. అమ్మ ఇక్కడికి రాదు" అన్నాడు శాంతంగా.

"హమ్మయ్య. నా నెత్తిన పాలు పోశారు. అయితే ఈ ప్రయాణం దేనికి?" అన్నది అనుమానంగా.

"ఇక్కడికి రాదు అన్నానుగానీ అమ్మని తీసుకురాను అనలేదుగా?"

"ఏమిటీ పిచ్చి సమాధానాలు? కాస్త అర్ధమయేలా చెప్పొచ్చుగా?"

"చెప్పటానికి నాదగ్గర ఏం మిగిల్చావు? కట్టుకున్నావిడి కనుక వండి వారుస్తాను అంటూ తెగ ఉదారతను ఒలకపోశావ్. ఇక నీకు ఆ బాధ కూడా వుండకూడదని వెళ్లిపోతున్నాను. పిల్లలు నిన్ను నెత్తిమీద పెట్టుకుని చూస్తారన్న నమ్మకం నీకుంది కనుక నీగురించి దిగుల్లేదు. నా స్వార్జితంలో మీకు చెందాల్సింది బ్యాంక్‌లో మీపేర వేసి నా బాధ్యత తీర్చుకున్నాను. అలాగే నా కన్నతల్లి పట్ల నా బాధ్యత కూడా తీర్చుకోవాలిగా? అందుకే ఈ ప్రయత్నం!"

"ఓహో! ఇలా సాధిస్తున్నారా? ఎక్కడికి వెళ్తారో వెళ్లండి.. వెళ్లి ఎట్లావుంటారో- ఏం చేస్తారో నేనూ చూస్తాను."

పరాంకుశం మరి మాట్లాడలేదు. సూట్‌కేస్‌తో బయటికి నడిచాడు. అతని మనసు ప్రశాంతంగా వుంది.

తను వెళ్లేది ఆలయం లాంటి అమ్మ ఒడిలోకి. నిజంగా అది ఒక దేవాలయమే. అక్కడెందరో దేవతల్లాంటి తల్లులు. వాళ్ల డబ్బు తీసుకుని వృద్ధులకు ఊపిరి పోస్తున్నారు. స్వంత బిడ్డలూ డబ్బు తీసుకుంటారు హక్కుగా. అందుకు ప్రతిఫలంగా ఏమివ్వగలుగుతున్నారు? రక్తసంబంధాన్ని గడ్డిపరకలా తీసిపడేసి- మనస్సాక్షిని చంపిపాతేసి, స్వంత సుఖానికి స్వార్ధానికి విలువిచ్చి మానవత్వానికే మచ్చలా మిగిలిపోతున్నారు. అలాంటి స్వార్ధపరుల కన్నా ఎంతో మెరుగు ఆ దేవాలయాలు. లేవలేని స్థితిలో వున్నవాళ్లకు ఆసరా ఇచ్చి- అసహ్యించుకోకుండా అన్ని ఉపచారాలు చేస్తున్నారు. డబ్బుకోసం చేసినా అది ఔన్నత్యమే. అమ్మకు తనెక్కడో అనాథగా పడివున్నానన్న భావన రాకుండా తను కూడా వుంటాడు. అమ్మకు తను-తనకు అమ్మ! ఈ జీవితానికి ఇంతకంటే పరమార్ధం ఏముంది?

